నేడు 'సాక్షి', శ్రీసరస్వతి పాఠశాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

చంపాపేట: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం 'సాక్షి' దినపత్రిక, కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ లెక్కల లలితా రెడ్డి తెలిపారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శుభోదయ కాలనీలోని భగత్‌సింగ్ క్రీడా మైదానంలో శనివారం ఉదయం గం''9.30లకు ముగ్గుల పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. పోటీల్లో పాల్గొనే మహిళలు అందుకు అవసరమైన వస్తువులను తెచ్చుకోవాలని సూచించారు. పోటీలలో పాల్గొన్న మహిళలకు ప్రథమ. ద్వితీయ. తృతీయ బహుమతులతో పాటు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9959564939, 9705347247 ఫోన్ నెంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పీసీ ఆదిత్యకు నెల్సన్ మండేలా స్మారక పురస్కారం



నాగోలు: విలక్షణ దర్శకుడు డాక్టర్ పీసీ ఆదిత్య మరో అరుదైన పురస్కారాన్ని అందుకున్నారు. నెల్సన్ మండేలా స్మారక పురస్కారానికి ఆయన ఎంపికయ్యారు. ఈ మేరకు గ్లోబల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ నిర్వాహకులు నెల్సన్ మండేలా ఇంటర్నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు 2025 పంపిస్తూ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా పీసీ ఆదిత్య మాట్లాడుతూ తన సుదీర్ఘ సినీ ప్రయాణంలో ఎందరో నటీనటులు, సాంకేతిక నిపుణులను సినీ రంగానికి పరిచయం చేశానన్నారు. ఎన్నో సందేశాత్మక, సామాజిక సమస్యలపై సినిమాలు, లఘు చిత్రాలు రూపొందించానన్నారు. తన సేవలను గుర్తించిన గ్లోబల్ ఎడ్యుకేషనల్ కౌన్సిల్ తనకు కు నెల్సన్ మండేలా స్మారక పురస్కారం అందజేసినందుకు ఆనందంగా ఉందన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా ఉంటుందని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కే పురం డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి చెక్కు లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల ఆరోగ్య పరిరక్షణకు ఈ పథకం ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, ఆర్‌కే పురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, గొడుగు శ్రీనివాస్, సాజీద్, పెంబర్తి శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు ఊర్మిళ రెడ్డి, వెంకటేష్ గౌడ్, రమేష్ కురుమ, దీపు , జయమ్మ, ప్రమీల, లబ్ధిదారులు రాములు, గోపాల్, నాగమణి, పద్మావతి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు ఉదయ్‌నగర్, పద్మానగర్, గాయత్రీనగర్, మందమల్లమ్మ చౌరస్తా, కర్మన్‌ఘాట్, నిర్మలానగర్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ తెలిపారు. వినియోగ దారులు దీనిని గమనించి సహకరించాలని కోరారు.



విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



పూజలు చేస్తున్న మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి దంపతులు



కర్మన్‌ఘాట్ కోదండరామాలయంలో బారులు తీరిన భక్తులు



శ్రీపురంకాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..

సర్వ పాప హరణం.. వైకుంఠ ద్వార దర్శనం

- ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు
- ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు
- పలు ఆలయాల్లో అన్నదానాలు, ప్రసాద వితరణ

వైకుంఠ ఏకాదశి సందర్భంగా, ఎల్‌బీనగర్, మలక్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు గోవింద నామస్మరణ చేస్తూ వైకుంఠ ద్వార దర్శనానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో క్యూలైన్‌లలో బారులు తీరారు. విజయశ్రీకాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఉత్తర ద్వార దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు. కర్మన్‌ఘాట్ కోదండరామాలయం గోవింద నామ స్మరణలతో మారుమోగింది. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అన్నదానాలు, ప్రసాద వితరణ చేశారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ బృందం



దిల్‌సుఖ్‌నగర్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో..



లింగోజిగూడ డివిజన్ గ్రీన్‌పార్కుకాలనీలో..



ఆదిత్యానగర్‌కాలనీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో..



జనప్రియహోమ్స్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో..



అగ్రికల్చర్‌కాలనీ రామాలయంలో..



మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ దంపతులు



అష్టలక్ష్మీ దేవాలయంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు

నాగోలు: పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని జైపురికాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధిలోని జైపురి కాలనీ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలి పటాల (పతంగుల) పోటీలు నిర్వహించారు. బాలికలు రంగు రంగుల ముగ్గులు వేసి పాఠశాల ప్రాంగణాన్ని అందంగా తీర్చి దిద్దారు. బాలురు తాము స్వయంగా తయారు చేసిన పతంగులను ప్రదర్శించారు. విద్యార్థులు హరిదాసుల వేష ధారణ లో కీర్తనలు పాడి అలరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవాలని, మన ఆచార వ్యవహారాలను అర్థం చేసుకోవాలన్నారు. అనంతరం భోగి మంటలు, పాలు పొంగించి అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అనంత రెడ్డి, మేరీ బ్యుల, రమా దేవి, సుధారాణి, అంగన్వాడీ ఉపాధ్యాయురాలు లలిత, మేఘమాల, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ పాఠశాలలో..

వనస్థలిపురం: వనస్థలిపురంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం సంక్రాంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగురంగుల రంగ వల్లులను తీర్చిదిద్ది, గొబ్బెమ్మలు ఆట, పాటలతో సందడి చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ఏజీఎం హేమాంబర్ మాట్లాడుతూ పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతిబింబాలన్నారు. సంప్రదాయాలను గౌరవించాలని వాటిలో వైజ్ఞానిక పరిజ్ఞానం ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ భవానీ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో..



సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

చిన్నారులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలి




సైదాబాద్: విద్యార్థులను చిన్నప్పటినుంచే వారికి ఆసక్తి ఉన్న రంగంలో ప్రోత్సహించడంతో పాటు తగిన శిక్షణ ఇవ్వటం ద్వారా ఆయా రంగాల్లో వారు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెషన్ డెవలప్‌మెంట్ మేనేజర్ హేమా ఠాకూర్ అన్నారు. శుక్రవారం చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఎడుఫెస్ట్ వైబ్స్ 2024–25 పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. హేమా ఠాకూర్, పాఠశాల కరస్పాండెంట్ కె.గోవర్ధన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో తాము నేర్చుకున్న పాఠ్యాంశాలను ప్రీ ప్రైమరీ విద్యార్థులు వినూత్నంగా నమూనాల రూపంలో, డ్రామాలు, నృత్య ప్రదర్శనల రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. 199కి పైగా అంశాల్లో విద్యార్థులు ప్రదర్శించిన కళాకృతులు ఆహూతులను విశేషంగా అలరించాయి. విద్యా పరీక్షలు, పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టీచర్ మెంటార్ కళ్యాణ్‌శర్మ, పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జ్ మాధురి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామీణ సంస్కృతిపై అవగాహన పెంచుకోవాలి



హస్తినాపురం: గ్రామీణ ప్రాంతాలలో ప్రజల జీవన విధానం, వారి నేపథ్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని అక్షర ఇంటర్నేషనల్ పాఠశాల సీఈఓ అర్శనపల్లి మదన్‌మోహన్‌రావు అన్నారు. భావి తరాలకు నాటి గ్రామీణ ప్రజల జీవన విధానాన్ని తెలియజేసేందుకు శుక్రవారం అక్షర ఇంటర్నేషనల్ స్కూల్ ఎల్‌బీనగర్ బ్రాంచ్ లో గ్రామోత్సవ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మదన్‌మోహన్‌రావు మాట్లాడుతూ కాలానుగుణంగా మారుతున్న సమాజంలో ప్రజల జీవన విధానం ఎంతో మారిందని, తదనుగుణంగా ప్రజల జీవన శైలిలో ఎన్నో మార్పులు చోటు చేసుకున్నాయన్నారు. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులు గ్రామీణ ప్రజల వేశధారణలో అలరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఉండే కులవృత్తులు రోజువారి కార్యక్రమాలను గుర్తు చేసేలా విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల విద్యార్థులు బృందాలుగా విడిపోయి వారు గ్రామీణ నేపథ్యాన్ని ప్రదర్శిస్తూ చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమణి వారణాసి, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ



లింగోజిగూడ: తెలంగాణ రాష్ట్ర బీసీ న్యాయవాదుల సంక్షేమ సంఘం జూపల్లి కృష్ణ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను శుక్రవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం బీసీ న్యాయవాదులు తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు జూపల్లి కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు భూపాల్ రాజ్,రామ్మోహన్, రాజశేఖర్. బ్రహ్మాచారి, రమేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

హయత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులతో పాటు వినియోగదారులను పోలీసులు అరెస్టు చేసిన సంఘటన గురువారం రాత్రి హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హయత్‌నగర్ అన్మగల్ బస్తీకి చెందిన నాయిని శ్యాం తన సహచరులతో కలిసి దూల్‌పేట్ నుంచి గంజాయి తీసుకొచ్చి విక్రయించేవాడు. ఈ నేపథ్యంలో 2023 జులైలో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జైలు నుంచి బయటికి వచ్చిన తర్వాత అతను తన స్నేహితులు చందు, రాజేష్‌కుమార్‌లతో కలిసి ముఠా ఏర్పాటు చేశారు. గత నెల వారు ముగ్గురు ఒడిశా రాష్ట్రం, మల్కాన్‌గిరికి వెళ్లి అర్జున్ అనే వ్యక్తి వద్ద 7 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. దానిని 100 గ్రాముల చొప్పున ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్నారు. గురువారం హయత్‌నగర్ జీ స్కూల్ సమీపంలో ఉదయ్‌కుమార్, రాఘవేందర్, జోగు వరుణ్‌కుమార్, మహేష్, అఖిల్‌రాజ్ అనే వ్యక్తులకు గంజాయి విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో దాడి చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 4.5 కిలోల గంజాయి, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు.



నాగోల్ సాయినగర్ కాలనీ రోడ్డు నెంబర్.1లోని రాక్‌వుడ్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న టీచర్లు, చిన్నారులు - సాక్షి, సిటీబ్యూరో

పసికందు హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని కన్నకొడుకును (1.5) హత్య చేసిన తల్లితో పాటు ఆమె ప్రియుడికి జీవిత ఖైదు విధిస్తూ రంగారెడ్డి జిల్లా 10 వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జయలక్ష్మి శుక్రవారం తీర్పు చెప్పారు. ఏపీపీ కృష్ణమూర్తి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... కృష్ణ జిల్లాకు చెందిన మహాలక్ష్మికి ఏడాదిన్నర కుమారుడు ఉన్నాడు. ఆమె శంకర్‌పల్లి మండలం, మోకిల గ్రామానికి చెందిన శ్రీకాంత్ రెడ్డి అనే యువకుడితో వివాహేతర సంబంధం కొనసాగించేది. తన సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ఇద్దరూ కలిసి పసికందును హతమార్చి శంకర్‌పల్లి ఠాణా పరిధిలోని పంటపొలాల్లో పూడ్చివేశారు. 2014 జూన్ 20న జోగు కుమార్ అనే యువకుడు పొలం దున్నుతుండగా పసికందు మృతదేహం బయటికి వచ్చింది. దీంతో అతను వీఆర్ఓకు సమాచారం అందించడంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయస్థానం నిందితులకు పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చింది.

మహిళ ఆత్మహత్య



సౌజన్య మృతదేహం

హయత్‌నగర్: మానసిక స్థితి లేని ఓ మహిళ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన రామకృష్ణ పదేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన సౌజన్య(30)ను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వారికి ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చిన వారు హయత్‌నగర్‌లోని ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నారు. సౌజన్యకు కొంత కాలంగా మతి స్థిమితం సరిగా లేకపోవడంతో తరుచూ భర్తతో గొడవ పడుతూ ఉండేది.. శుక్రవారం గొడవ జరగడంతో మనస్తాపానికి లోనైన ఆమె ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.